క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లోని దేవాలయాల్లో శ్రావణ మాసం పౌర్ణమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహ కంబ గిరి స్వామి, అభయాంజనేయస్వామి, లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాయలూరు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి

ఉయ్యాలవాడ: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఆరోగ్య సిబ్బందిపై ఉందని జిల్లా మలేరియా వైద్యాధికారి చంద్రశేఖర్ సూచించారు. శనివారం మండలంలోని మాయలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కుటుంబాలను పరామర్శించి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

కాలువల్లో పూడికతీత



జేసీబీతో పూడికతీత పనులు

ఉయ్యాలవాడ: మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామంలో కాలువల్లో పేరుకుపోయిన పూడికను శనివారం జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మిదేవి సొంత నిధులతో తొలగించారు. ఇళ్లలోని వృథా నీరు, వర్షపు నీరంతా ఆర్.జంబులదిన్నె గ్రామానికి వెళ్లే రహదారిలోని కాలువలో నిలిచిపోయింది. దీంతో ముళ్లపొదలు, చెత్తాచెదారంతో కాలువలు మూసుకుపోయాయి. జేసీబీ సహాయంతో పూడికతీత చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పౌష్టికాహారం తప్పనిసరి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

రుద్రవరం: మండల పరిధిలోని ఆర్. నాగులవరం అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ ఆల్ఫ్రేడ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి వచ్చే పౌష్టికాహారం చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు సకాలంలో అందించాలని తెలిపారు. చిన్నారులకు ఆటపాటలతో పాటు అక్షరాలు దిద్దించాలని సూచించారు. కేంద్రంలోని పిల్లలతో మాట్లాడి ఆహారం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. పద్యాలు పాడించగా చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పొగాకుతో తాత్కాలిక ఆనందమే



బాలికతలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న హెడ్‌మాస్టర్

దొర్నిపాడు: పొగాకు తాత్కాలిక ఆనందాన్ని ఇచ్చి భవిష్యత్తులో మనిషి మరణాన్ని కోరుకుంటుందని హెడ్‌మాస్టర్ చెన్నకేశ్వరి అన్నారు. శనివారం టోఫీ(పొగాకు రహిత విద్యా సంస్థ) కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీహెచ్ బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యాసంస్థలను పొగాకు రహితంగా మార్చడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పొగాకు ఉత్పత్తుల వాడకం నుంచి రక్షించడానికి రూపొందించిన కార్యక్రమం అన్నారు. పాఠశాలకు చుట్టుపక్కల ఎవరేగాని పొగాకు ఉత్పత్తులను విక్రయించడానికి వీలులేదన్నారు. దీని వల్ల అనేక అనర్థాలు వస్తాయని కావునా విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పొగాకు తీసుకోవడం వల్ల క్యాన్సర్, లివర్, ఊపిరి తిత్తులు పాడవుతాయని తెలిపారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- పురుగుమందు పిచికారీలో జాగ్రత్తలు తప్పనిసరి
- శరీరం నిండా దుస్తులు ధరించాలి
- ముఖానికి మాస్క్ ఉండేలా చూసుకోవాలి
- నిర్లక్ష్యంతో ప్రాణానికే ముప్పు



వరి పైరులో మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

గోస్పాడు: పంటల్లో చీడపీడల నివారణకు రైతులు పురుగు మందులు పిచికారీ చేస్తుంటారు. ప్రస్తుతం మండలంలో వరి పైరులో తెగుళ్ల నివారణకు రసాయన క్రిమిసంహార మందులు స్ప్రే చేస్తున్నారు. అయితే పిచికారీ చేసే సమయంలో రైతులు, కూలీలు కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. దీని వల్ల కొన్ని సందర్భాల్లో ప్రాణాల మీదకు వస్తుంది. పురుగు మందు పిచికారీలో తీసుకోవలసిన జాగ్రత్తలను వ్యవసాయ అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. ఒకోసారి ఎంత అప్రమత్తంగా ఉన్నా విష ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. మూడు రకాలుగా పురుగు మందులు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ ఏడాది మండలంలో దాదాపు 8వేల ఎకరాల్లో పంటలు సాగు చేశారు.

చర్మం ద్వారా...

పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో విషం చర్మం నుంచి శరీరంలోకి ప్రవేశించే ప్రమాదముంది. శరీరంపై పుండ్లు, గాయాలు ఉంటే మరింత సులభంగా శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఆ తరువాత ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుంది.

ముక్కు ద్వారా...

క్రిమిసంహారక మందుల పిచికారీ ద్వారా వెలువడే వాయువులను పీల్చడం ద్వారా విషం శరీరంలోకి ప్రవేశించి హాని కలిగిస్తాయి. తరచూ ఇదే రకంగా పీలుస్తుంటే ముక్కు జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది.

నోటి ద్వారా...

పురుగు మందులు పిచికారీ చేశాక చేతులు శుభ్రంగా కడుక్కోకుండా ఆహార పదార్థాలు భుజిస్తే నోటి ద్వారా విష పదార్థాలు శరీరంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఒక్కోసారి మందు ప్రభావం ఎక్కువై మరణం కూడా సంభవించవచ్చు.

ఇలా చేయాలి...

చర్మం ద్వారా విష పదార్థాలు శరీరంలోకి ప్రవేశిస్తే వెంటనే సబ్బు, మంచినీటితో శుభ్రంగా కడగాలి. ఒకవేళ కళ్లలో పడితే మంచినీటితో ఎక్కువ సార్లు కడగాలి. చికిత్స కోసం వెంటనే దగ్గరలోని వైద్యుడిని సంప్రదించాలి. ముక్కుతో పీల్చితే విష ప్రభావానికి గురైన వ్యక్తిని గాలి, వెలుతురు బాగా వచ్చే ప్రదేశంలో ఉంచాలి. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటే వెంటనే కృత్రిమ శ్వాస అందించాలి. వీలైనంత త్వరగా వైద్యుని వద్దకు తీసుకువెళ్లి చికిత్స అందించే ఏర్పాటు చేయాలి. మందు నోటి ద్వారా కడుపులోకి వెళ్తే వాంతి చేయించాలి. గ్లాసుడు నీళ్లలో ఉప్పు లేదా ఆవాల పొడి కలిపి తాగించాలి.

జాగ్రత్తలతో ప్రయోజనం..

- మందులు పిచికారీ చేసే సమయంలో ముఖాన్ని పూర్తిగా గుడ్డతో కప్పుకోవాలి. కళ్లకు అద్దాలు పెట్టుకోవాలి. కొన్ని రకాల మందులు కళ్లలో పడితే కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది.
- మందులు పిచికారీ సమయంలో మద్యం తాగడం, చుట్ట, బీడీ, సిగరెట్ వంటివి పీల్చడం చేయరాదు.
- మధ్యాహ్నం సమయంలో ఎండవేడి ఎక్కువగా ఉన్నప్పుడు మందులు పిచికారీ చేయరాదు.
- ఈ సమయంలో వదులుగా ఉండే దుస్తులు ధరించాలి.
- గాలి వాటానికి ఎదురెళ్తూ మందులు చల్లకూడదు.
- పిచికారీ చేసిన తరువాత కాళ్లు, చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
- మందు వినియోగించిన తర్వాత డబ్బాలు, కవర్లు భూమిలో గొయ్యి తీసి పాతి పెట్టాలి, లేదా కాల్చివేయాలి.
- మందులు పిచికారీ చేసే చేస్తున్నప్పుడు లేదా చేసిన తర్వాత ఎవరైనా విష ప్రభావానికి లోనై వాంతులు చేసుకుంటున్నా కళ్లు తిరుగుతున్నట్టయితే, చర్మం దురదలు పెడుతున్నా వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స చేయించుకోవాలి.

పురుగు మందుల పిచికారీతో ప్రమాదం



పంటల సాగులో భాగంగా రైతులు, రైతు కూలీలు పొలాల్లో ఎరువులు, పురుగు మందులను పిచికారీ చేస్తుంటారు. అలాంటి సమయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలకు గురి కావాల్సి వస్తుంది. పిచికారీ చేసే సమయంలో ముఖానికి మాస్క్ ధరించడంతో పాటు ఎదురు గాలికి మందు స్ప్రే చేయకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి. ఏదైనా ఇబ్బంది అనిపిస్తే వెంటనే ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోవాలి.

– కాంతారావునాయక్, వైద్యాధికారి, గోస్పాడు

జాగ్రత్తలు పాటించాలి



క్రిమి సంహారక మందులు పిచికారీ చేసేటప్పుడు శరీరం నిండా దుస్తులు ధరించాలి. ముక్కు, నోటికి గుడ్డ మాస్క్ ధరించాలి. లేదా సేఫ్టీ సూట్ ధరించాలి. రైతులు పైర్లకు అనుగుణంగా మందులు వేయాలి. మోతాదుకు మించి ఎరువులు, మందుల వాడకం పైర్లను దెబ్బతీసే అవకాశం ఉంది. మందుల పిచికారీ సమయంలో జాగ్రత్తలు పాటించకపోతే ప్రాణాలకే ప్రమాదంగా మారొచ్చు.

–స్వప్నికారెడ్డి, ఏఓ, గోస్పాడు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు



పవిత్ర హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

వైభవంగా పవిత్రోత్సవం

ఆళ్లగడ్డ: ఎగువ అహోబిలం శ్రీజ్వాలనృసింహస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం తెల్లవారుజామున నిత్య పూజల అనంతరం మూలవిరాట్ ఉగ్రనరసింహస్వామి, చెంచులక్ష్మీ అమ్మవార్లకు పవిత్రమాలలను ధరింపజేశారు. ఉత్సవమూర్తులైన స్వామి అమ్మవార్లను యాగశాలలో కొలువుంచి నవకలశ స్నపనం, ద్వారతోరణ పూజ, మండల ప్రతిష్ఠ, కుంభ ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య పవిత్ర హోమం నిర్వహించారు. రాత్రి ఉభయదేవేరులతో ఉగ్రనరసింహస్వామి విశేష పుష్పాలంకరణ గావించిన ఉత్సవ పల్లకీ అధిష్ఠించి మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

శిరివెళ్ల: ప్రభుత్వ ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు ఈ ఏడాది డిసెంబర్‌లోగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ యోగేశ్వరరావు అన్నారు. శనివారం యర్రగుంట్లలో ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. లేఔట్‌లోని ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. మొత్తం 370 ఇళ్లలో గడిచిన 15 నెలల వ్యవధిలో 32 నిర్మాణాలు పూర్తయినట్లు చెప్పారు. 130 ఇళ్లు పునాది దశలో, 11 ఇళ్లు లెంటల్ లెవెల్, మరో 205 ఇళ్లు గుంతలకే పరిమితమయ్యాయని వెల్లడించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతి కోసం ప్రభుత్వం అదనంగా ఎస్సీ, బీసీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలను అందజేస్తోందని తెలిపారు. త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు.

ఆటోడ్రైవర్లు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



ఆటోలో వస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): స్వశక్తితో జీవనం సాగించే ఆటో డ్రైవర్లు తమ ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని కాపాడుకుంటూ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సూచించారు. శనివారం స్థానిక మున్సిపల్ టౌన్ హాలులో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో 10,006 మంది ఆటో డ్రైవర్లకు రూ.15.09 కోట్ల నగదు నేరుగా ఖాతాల్లో జమ చేయబడ్డాయని తెలిపారు. ఆటో డ్రైవర్లకు సరైన పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ ఆటోలో టౌన్ హాల్ వరకు ప్రయాణించారు. కాగా జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న, జిల్లా రవాణా అధికారి శివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, డీఎల్‌డీఓ శివారెడ్డి, ఎంపీడీఓ సుగుణశ్రీ పాల్గొన్నారు.

టపాసు విక్రయాలకు 'సింగిల్ విండో' అనుమతులు



అధికారులతో మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

నంద్యాల: నంద్యాల జిల్లాలో టపాసు విక్రయశాలల ఏర్పాటు కోసం ఈ ఏడాది సింగిల్ విండో పద్ధతి ద్వారా అనుమతులు మంజూరు చేస్తామని జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో తాత్కాలిక టపాసు విక్రయశాలల ఏర్పాటుపై సంబంధిత శాఖాధికారులు, వ్యాపారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఫైర్, పోలీస్, రెవెన్యూ శాఖల అనుమతులను ఒకే చోట సింగిల్ విండో వ్యవస్థ ద్వారా మంజూరు చేసేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. దీనివల్ల వ్యాపారులకు ఇబ్బందులు తొలగుతాయన్నారు. తాత్కాలిక లైసెన్స్ కోసం వ్యాపారులు ఈ నెల 15వ తేదీలోపు సంబంధిత రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో తమ దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 18వ తేదీలోగా అనుమతులు జారీ చేస్తారన్నారు. విక్రయశాలల వద్ద అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, అదనపు ఎస్పీ యుగంధర్ బాబు, నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, డోన్ ఆర్డీఓ నరసింహులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వసంతోత్సవం



వసంతోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

రుద్రవరం: మండల కేంద్రంలో ఆర్యవైశ్యులు వసంతోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చోళవేటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు జరిగాయి. ఉత్సవాల ముగింపులో ఊరేగింపు నిర్వహించగా యువత ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.

ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వరా?



మాట్లాడుతున్న ఎంపీపీ ఆర్థర్ సైమాన్

గోస్పాడు: గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించే సమయాల్లో ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ దక్కడం లేదని ఎంపీపీ ఆర్థర్‌సైమాన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీఓ అమానుల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు గౌరవం లభించడం లేదన్నారు. అధికారులు కూడా గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీలతో పాటు ఎంపీపీ, వైస్ ఎంపీపీలకు సమాచారం ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం అంటూ ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులకే తెలియకుండా చేయడం ఏమిటని ప్రశ్నించారు. సర్వసభ్య సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామాల్లో రైతులకు తగినంత యూరియా అందలేదని తెలిపారు. అలాగే ఎం.కృష్ణాపురం వచ్చే బస్సు వేళకు రావడం లేదని, ఎప్పుడు పడితే అప్పుడు వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సర్పంచ్ కోటిరెడ్డి సభ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆర్టీసీ అధికారులు సకాలంలో బస్సులు వచ్చేలా చూస్తామని చెప్పారు. వైస్ ఎంపీపీలు జనార్దన్‌రెడ్డి, రాజు, తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

రక్షణ గోడ ఏర్పాటు చేయండి



తక్కువ ఎత్తులో ఉన్న వంతెనపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

నంద్యాల(అర్బన్): స్థానిక ఎస్‌బీఐ కాలనీ నుంచి రామకృష్ణ పీజీ కళాశాల వైపు వెళ్లే రహదారిలోనున్న పాలేరు వాగు వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. నల్లమల కొండల నుంచి గాజులపల్లె మీదుగా పాలేరువాగు వర్షా కాలంలో వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తుంది. వరదనీరు ప్రవాహం కొనసాగినంత కాలం ఆ ప్రాంతం నుంచి రాకపోకలు నిలిచిపోతున్నాయి. రాకపోకలు సాగించే క్రమంలో పలువురు వంతెన మీద నుంచి పడి ప్రాణాలతో బయట పడిన సంఘటనలు అనేకం. వంతెనకు ఇరువైపులా రక్షణగోడల ఏర్పాటుతో పాటు వంతెన ఎత్తును పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ మాత గ్రామోత్సవం



పట్టణంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దసరా తర్వాత వచ్చే ఆదివారం జరిగే మా ఊరి విందును పురస్కరించుకొని పట్టణంలో వాసవీ మాత పీఠాలను శనివారం పట్టణంలో ఊరేగించారు. వీధుల్లోకి వచ్చిన వాసవీ మాత పీఠాలకు ఆర్యవైశ్య మహిళలు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు భవనాసి వాసు, శేషు మాట్లాడుతూ మెయిన్ బజార్‌లోని అమ్మవారిశాలలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం వసంతోత్సవం, మధ్యాహ్నం పట్టణ ఆర్యవైశ్యులందరికీ ఊరివిందు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మందు పిచికారీలో జాగ్రత్తలు తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న సీఐ

శిరివెళ్ల: పంటలపై మందులు పిచికారీ చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ దస్తగిరి బాబు అన్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందుల పిచికారీపై రైతులకు సరైన అవగాహన లేకపోతే అనర్థాలకు దారి తీస్తాయన్నారు. రైతులు రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులను చిన్న పిల్లలకు దూరంగా ఉంచాలని, పిచికారీ చేసేటప్పుడు కాళ్లు, చేతులు పూర్తిగా కప్పి ఉండేలా డ్రస్ ధరించాలన్నారు. ముఖానికి మాస్క్, కళ్లకు అద్దాలు పెట్టుకోవాలని తెలిపారు. పురుగు మందు కలిపేటప్పుడు చేతులకు గ్లౌజ్‌లను ధరించాలన్నారు. పిచికారీ సమయంలో తినడం, బీడీ తాగడం చేయరాదన్నారు. ప్రభుత్వ అనుమతి పొంది దుకాణాల్లో మాత్రమే మందులను కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చిన్న పీరయ్య, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

గోస్పాడు: నంద్యాల ప్రభుత్వాసుపత్రికి లయన్స్ క్లబ్ అందించిన సహకారం మరువలేనిదని నంద్యాల ప్రభుత్వాసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ మల్లేశ్వరి అన్నారు. శనివారం లయన్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యుడు, పారిశ్రామికవేత్త ఆత్మకూరు సుదర్శనం శెట్టి, ఆత్మకూరు నాగభూషణంశెట్టి ఛారిటీ సౌజన్యంతో ఆసుపత్రికి రెండు వీల్‌చైర్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో రోగుల సౌకర్యార్థం వీల్‌చైర్లను అందజేయడం అభినందనీయమన్నారు. ఆర్ఎంఓ వెంకటేశ్వర్లు, డాక్టర్ జిలానీ, డాక్టర్ రవికృష్ణ, లయన్స్ క్లబ్ ప్రాంతీయ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కోశాధికారి జనార్దన్, సభ్యులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో సినీ దర్శకులు



మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ప్రముఖ సినీ దర్శకులు హరీశ్ శంకర్, మల్లిడి వశిష్ఠ శనివారం పూజలు నిర్వహించారు. శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుని అభి షేకం, కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో వారిని చూసిన భక్తులు ఫొటోలు తీసుకుని అభిమానం చాటుకున్నారు. బింబిసార సినిమా తనకు గుర్తింపు ఇచ్చిందని, చిరంజీవి నటించిన విశ్వంభర చిత్రానికి కథ, దర్శకత్వం వహించానని తెలిపారు.

ఉద్యమ బలోపేతమే లక్ష్యం

నంద్యాల(అర్బన్): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా క్రీమీలేయర్ విధానాన్ని రద్దు చేయడం, మాలల్లో చైతన్యం నింపి ఉద్యమ బలోపేతమే లక్ష్యంగా ముందుకెళ్దామని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వైసీ పుల్లయ్య పిలుపునిచ్చారు. మాలలు ఉద్యమ బాట పడితేనే హక్కులను సాధించుకోగలుగుతామన్నారు. స్థానిక చెరువు కట్ట సమీపంలోని కార్యాలయ ఆవరణలో మాలమహానాడు నాయకుల విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. పుల్లయ్య మాట్లాడుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కారం శివాజీ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా నూతన కమిటీని ఈనెల 11వ తేదీన ఎన్నుకుంటామన్నారు. రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి, నరసింహులు, దేవాంతకుడు, జియాన్, రాజ్‌కమాల్, సురేష్‌పాల్, శివుడు పాల్గొన్నారు.

పత్తిలో తెగుళ్ల నివారణ చేపట్టండి



మాట్లాడుతున్న ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ విల్సన్

నంద్యాల(అర్బన్): పత్తిలో కాయకుళ్లు తెగులు, ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు రైతులు మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ని లీటరు నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ విల్సన్, కీటక శాస్త్రవేత్త శివరామకృష్ణ తెలిపారు. ఆర్థిక నష్ట పరిమితి ఆధారంగా పచ్చదోమ, పేనుబంక, తామర పురుగును నియంత్రించేందుకు ఎసిఫేట్ 1.5 గ్రాములు, ఫిప్రోనిల్ 2.0మి.లీ ఎసిటామీ ప్రిడ్ 0.2 గ్రాములు లీటరు నీటికి కలిపి స్ప్రే చేయాలన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఆర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ చైతన్య శనగ, వరిలో తెగుళ్లు, యాజమాన్యం, శనగ పంటలో విత్తనశుద్ధి గురించి వివరించారు. శాస్త్రవేత్త ఇషాపర్వీన్, జిల్లా వ్యవసాయ శాఖ డీడీఏ మద్దిలేటి పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



వెంకటేశ్వర్లు

రుద్రవరం: మండల పరిధిలోని ఎల్లావత్తుల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు ఎస్‌ఐ మహమ్మద్ రఫీ శనివారం తెలిపారు. సెప్టెంబర్ 23న బజారుకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో అతని కుమారుడు రమణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.